పటేల్‌నగర్‌లో అగ్నిప్రమాదం



మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

గన్‌ఫౌండ్రీ: గాంధీభవన్ వద్ద ఉన్న పటేల్‌నగర్‌లో బుధవారం అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. బేగంబజార్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని బాచ్ మెకానిక్ షెడ్‌లో ఈ సంఘటన చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..బాచ్ మోటార్స్ మెకానిక్ షెడ్‌లో డీజిల్, పెట్రోల్‌తో బాచ్ పంప్ రిపేరింగ్ చేస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగా బుధవారం సైతం పలు వాహనాలకు రిపేర్ చేస్తున్న సమయంలో మెకానిక్ షెడ్‌లో షార్ట్ సర్క్యూట్ కారణంగా ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు. జన నివాసాల మధ్య ఇటువంటి దుకాణాలు ఉండటం శ్రేయస్కరం కాదని పలువురు కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేశారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా..



గోల్కొండ: ప్రీ ప్రైమరీ చదువుతున్న అమ్మాయిలు కిచెన్‌లో తాము అద్భుతాలు సృష్టిస్తామని చెబుతున్నారు. గ్లెండల్ అకాడమీ ప్రీప్రైమరీ విద్యార్థులకు జ్యూస్, బ్రెడ్ రోల్ తయారీల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో చిన్నారులు ఎంతో ఉత్సాహంగా పాల్గొని జ్యూస్‌లు, బ్రెడ్ రోల్స్ తయారు చేసి అందరిని అబ్బురపరిచారు. బొమ్మల దేవిక పోటీల్లో అగ్రస్థానంలో నిలిచింది. ఈ కార్యక్రమంలో టీచర్లు సబియా, మహేశ్వరి, అత్రియ తదితరులున్నారు.

వ్యక్తి అదృశ్యం



మహ్మద్ యూనుస్

చాంద్రాయణగుట్ట: వ్యక్తి అదృశ్యమైన ఘటన బండ్లగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఏఎస్సై బి.కృష్ణారెడ్డి బుధవారం తెలిపిన వివరాల ప్రకారం ..గౌస్‌నగర్‌కు చెందిన మహ్మద్ యూనుస్ షేక్(50) చికెన్ సెంటర్‌లో పనిచేస్తుంటాడు. గత నెల 20న ఉదయం ఇంట్లో చెప్పకుండా వెళ్లిన యూనుస్ తిరిగి ఇంటికి రాలేదు. అతని ఆచూకీ కోసం సాధ్యమైన అన్ని ప్రాంతాల్లో వెతికినా ప్రయోజనం లేకుండా పోయింది. అతని భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఆచూకీ తెలిసిన వారు 87126 65184 నంబర్‌లో సమాచారం ఇవ్వాలని పోలీసులు తెలిపారు.

ఈ- సిగరెట్ల విక్రేత అరెస్టు

చార్మినార్: ఈ-సిగరెట్లు విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసిన ఘటన కాలాపత్తార్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. టాస్క్ ఫోర్స్ అడిషనల్ డీసీపీ శ్రీనివాస్ వివరాల ప్రకారం.. కాలాపత్తర్ ప్రాంతానికి చెందిన మహమ్మద్ వికారుద్దీన్ అలియాస్ మహమ్మద్ (20) గత కొంతకాలంగా ఈ సిగరెట్లను విక్రయిస్తున్నాడు. హుస్సేనీ ఆలం ప్రాంతానికి చెందిన లక్ష్య గోయల్ అలియాస్ స్కైలాబ్తో కలిసి ఢిల్లీకి చెందిన రాహుల్ నుంచి ఎల్రక్టానిక్ సిగరెట్లు కొరియర్ ద్వారా నగరానికి తెప్పించి విక్రయిస్తున్నాడు. సమాచారం అందుకున్న టాస్క్ ఫోర్స్, సౌత్-ఈస్ట్ జోన్ బృందం, కాలాపత్తర్ పోలీసు సిబ్బందితో కలిసి బుధవారం నిందితుడిని అరెస్టుచేసి రూ. 2,52,000 విలువ చేసే ఈ సిగరెట్లను స్వాధీనం చేసుకున్నారు.

మక్కా మసీదులో రంజాన్ సందడి

- సామూహిక ప్రార్థనలు, ఇఫ్తార్ విందులతో ఆధ్యాత్మిక వాతావరణం
- దేశంలో గల అతి పెద్ద పురాతన మసీదులో మక్కా మసీదు ఒకటి
- 77 ఏళ్ల పాటు ఈ నిర్మాణ పనులు



మక్కా మసీదు ప్రాంగణంలో నెలకొన్న సందడి



మక్కా మసీదులో ఇఫ్తార్ విందులో పాల్గొన్న ముస్లింలు

చార్మినార్: మక్కా మసీదులో రంజాన్ సందడి నెలకొంది. నగర ప్రజలే కాకుండా ఇతర జిల్లాలు, రాష్ట్రాల ముస్లింలు మక్కా మసీదును సందర్శించి ఇక్కడ జరిగే రంజాన్ ప్రార్థనల్లో పాల్గొంటున్నారు. దీంతో మక్కా మసీదు ప్రాంగణం పూర్తిగా ముస్లిం ప్రజలతో కళకళలాడుతోంది. రంజాన్ మాసం సందర్భంగా ముస్లింలు రోజంతా కఠోర ఉపవాస దీక్షలు కొనసాగిస్తూ రోజుకు ఐదుసార్లు నమాజ్ చేస్తారు. చాలా మంది సామూహిక ప్రార్థనలను మక్కా మసీదులో నిర్వహించడానికి ఇష్టపడుతారు. అంతేకాకుండా సాయంత్రం ఉపవాస దీక్షల అనంతరం నిర్వహించే ఇఫ్తార్ విందులు కూడా మక్కా మసీదు ప్రాంగణంలో నిర్వహించడానికి ఆసక్తి చూపిస్తారు. దీంతో ప్రతిరోజూ ఉదయం నుంచి రాత్రి తరావీ ప్రార్థనల వరకు మక్కా మసీదు సందడిగా మారుతోంది. మక్కా మసీదులో సామూహిక ప్రార్థనలు చేయడానికి ముస్లింలు ఆసక్తి చూపిస్తుండడంతో ఎక్కడ చూసిన ఆధ్యాత్మిక వాతావరణం కనిపిస్తుంది.

దేశంలో అతి పెద్ద పురాతన మసీదు..

దేశంలో గల అతి పెద్ద పురాతన మసీదులో మక్కా మసీదు ఒకటి. చార్మినార్ కట్టడానికి అతి సమీపంలో.. దక్షిణం వైపున సుమారు 100 గజాల దూరంలో మక్కా మసీదు ఉంది. మహ్మద్ ప్రవక్త మక్కాలో నిర్మించిన మసీదు నుంచి కొన్ని రాళ్లు తీసుకొచ్చి ఇక్కడి మసీదు నిర్మాణ సమయంలో ఉపయోగించారని..అందుకే ఈ మసీదుకు మక్కా మసీదని పేరొచ్చిందని చరిత్రకారుల అభిప్రాయం. మక్కా మసీదులోని ఆవరణలో ఎడమ వైపు ఉన్న బల్లపై ఒకసారి కూర్చుంటే.. మక్కా మసీదు సందర్శన కోసం మళ్లీ వస్తారనేది నమ్మకం.

మక్కా మసీదు నిర్మాణంలో మట్టిని వాడలేదు..

మక్కా మసీదు నిర్మాణంలో ఎక్కడ మట్టిని వాడలేరు. రాళ్ల పొడిని మాత్రమే ఉపయోగించారు. మక్కా మసీదు నిర్మాణానికి ఉపయోగించిన రాళ్లను మహబూబ్‌నగర్ జిల్లా షాద్‌నగర్ సమీపంలోని ఓ పెద్ద రాతి కొండను ఎంపిక చేశారు. కొండను తొలిచి ఎత్తైన రాళ్లతో మక్కా మసీదు నిర్మాణం జరిగింది. ఆ రాళ్లను ఎండ్ల బండ్ల ద్వారా మక్కా మసీదుకు తీసుకొచ్చారు.

1617లో మక్కా మసీదు నిర్మాణం ప్రారంభం..

మక్కా మసీదు నిర్మాణం 1617లో ప్రారంభమైంది. దాదాపు 77 ఏళ్ల పాటు ఈ నిర్మాణ పనులు జరిగి 1690లో పూర్తయ్యాయి. మక్కా మసీదు ఎత్తు 176 అడుగులు, మక్కా మసీదు లోపల 67 మీటర్ల పొడవు, 54 మీటర్ల వెడల్పు, 23 మీటర్ల ఎత్తు గల విశాలమైన ప్రార్థనలు హాల్ ఉంది. దాదాపు ఒకేసారి 3 వేల మంది ఈ హాల్‌లో ప్రార్థనలు చేసుకోవడానికి అవకాశాన్నివాకాన్ని కల్పించారు. మసీదుకు దక్షిణంలో ఐదుగురు ఆసఫ్‌జాహి రాజులు, వారి కుటుంబ సభ్యుల సమాధులు 14 ఉన్నాయి.

మహ్మద్ అమానుల్లాఖాన్ సేవలు మరువలేనివి



నివాళులర్పిస్తున్న ఎంబీటీ నాయకులు

చార్మినార్: మాజీ ఎమ్మెల్యే, ఎంబీటీ వ్యవస్థాపకుడు మహ్మద్ అమానుల్లాఖాన్ సేవలు మరువలేనివని ఎంబీటీ అధ్యక్షుడు ఫర్హతుల్లాఖాన్ కొనియాడారు. అమానుల్లా ఖాన్ వర్ధంతిని పురస్కరించుకుని బుధవారం ఎంబీటీ అధ్యక్షుడు ఫర్హతుల్లాఖాన్, అధికార ప్రతినిధి అంజదుల్లాఖాన్ తదితరుల బృందం ఆయన సమాధికి పూలు సమర్పించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..మజ్లిస్ పార్టీ నుంచి వేరు పడి సొంతంగా మజ్లిస్ బచావ్ తహ్రీక్ పార్టీని ఏర్పాటు చేసిన ఆయన ఎంబీటీ పార్టీ ద్వారా చాంద్రాయణగుట్ట ఎమ్మెల్యేగా ఎంపికయ్యారని..అన్ని వర్గాల ప్రజలకు ఆయన చేసిన సేవలు మరువ లేనివన్నారు. ఈ కార్యక్రమంలో ఎంబీటీ ప్రధాన కార్యదర్శి సయ్యద్ ముస్తఫా మహమూద్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల జీవితంలో పదో తరగతి ఎంతో ముఖ్యం



పదో తరగతి విద్యార్థులతో అధ్యాపక బృందం

గోల్కొండ: విద్యార్థి జీవితంలో పదో తరగతి ఎంతో ముఖ్యమని గోల్కొండ ఉర్దూ మోడల్ స్కూల్ అకాడమిక్ హెడ్ యాస్మిన్ బేగం అన్నారు. బుధవారం గోల్కొండ నయాఖిలాలోని ఉర్దూ మోడల్ స్కూల్‌లో పదో తరగతి విద్యార్థుల ఫేర్‌వేల్ డే జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పదో తరగతి జ్ఞాపకాలు జీవితాంతం ఉంటాయన్నారు. పదో తరగతి పరీక్ష రాయడంపై విద్యార్థులు తమపై ఒత్తిడి పెంచుకోవద్దు అన్నారు. పరీక్షలంటే భయపడే వారు ర్యాంకులు సాధించలేరని నిర్భయంగా పరీక్షలు రాసే వారే ఉత్తమ ఫలితాలు సాధిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉస్మానియాలో పరిశుభ్రతకు ప్రాధాన్యం



సిబ్బందిని అభినందిస్తున్న సూపరింటెండెంట్ డాక్టర్ రాకేష్ సహాయ్

అఫ్జల్‌గంజ్: ఆసుపత్రికి వచ్చే పేద రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంతో పాటు ఇన్‌ఫెక్షన్ల నివారణలో పూర్తి స్థాయిలో విజయం సాధించడం ఎంతో సంతృప్తిని ఇస్తుందని ఉస్మానియా జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాకేష్ సహాయ్ అన్నారు. బుధవారం ఆసుపత్రిలోని సెమినార్ హాల్‌లో ఆసుపత్రి ఇన్‌ఫెక్షన్ కంట్రోల్ కమిటీ సమావేశం నిర్వహించారు. వివిధ విభాగాలకు చెందిన వైద్యులు, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు. ఆసుపత్రిలోని అన్ని విభాగాల్లో రోగులకు ఇన్‌ఫెక్షన్ వ్యాపించకుండా నియంత్రించడం, నివారణ చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. హైక్వాలిటీ పేషంట్ కేర్, పరిసరాలు, వార్డుల్లో పరిశుభ్రతకు మొదటి ప్రాధాన్యమిస్తున్నామన్నారు.

ఎమ్మెల్సీ మల్క కొమరయ్యకు సన్మానం



మల్క కొమరయ్యను సన్మానిస్తున్న లవ్ ఫర్ కౌ ఫౌండేషన్ నాయకులు జస్మత్‌పటేల్ తదితరులు

సుల్తాన్‌బజార్: ఇటీవల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి మల్క కొమరయ్య గెలుపొందడం ఎంతో గర్వకారణమని లవ్ ఫర్ కౌ ఫౌండేషన్ చైర్మన్ జస్మత్‌పటేల్ అన్నారు. ఈ మేరకు బుధవారం మల్క కొమురయ్యను రాజ్యసభ సభ్యుడు కె.లక్ష్మణ్ సమక్షంలో నాంపల్లిలోని బీజేపీ కార్యాలయంలో ఘనంగా సత్కరించారు. అనంతరం లవ్ ఫర్ కౌ ఫౌండేషన్ మెమెంటోను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..బీజేపీ తరఫున ఎమ్మెల్సీ ఎన్నికల్లో నిలబడి గెలుపొందిన మల్క కొమరయ్య ఎంతో కష్టపడ్డారన్నారు. ఆయనకు బీజేపీ అగ్ర నాయకులు బండి సంజయ్, కిషన్ రెడ్డి, డాక్టర్ లక్ష్మణ్ లాంటి నాయకులు తోడ్పాటు అందించడం ఎంతో అభినందనీయమన్నారు. రానున్న రోజుల్లో తెలంగాణ రాష్ట్రంలో బీజేపీ వరస విజయాలను అందిపుచ్చుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ నాయకులు ఆర్‌కె.జైన్, రిదేష్ జాగిర్దార్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీనివాస చారికి మెరుగైన వైద్యం అందించాలి



శ్రీనివాసచారిని పరామర్శిస్తున్న శ్రీనివాస్ గౌడ్

అఫ్జల్‌గంజ్: మహబూబ్‌నగర్ జిల్లా, ఫతేపూర్ ప్రాంతానికి చెందిన శ్రీనివాసులు చారి ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయాలపాలై ఉస్మానియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలిసిన మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ బుధవారం ఉదయం ఆసుపత్రికి చేరుకొని ఆయనను పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని ఆర్‌ఎంఓ డాక్టర్ జయకృష్ణను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్య సేవలు అందించాలని కోరారు. వారి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఎంపీటీసీ కృష్ణయ్య, సర్పంచ్ కృష్ణయ్య గౌడ్ తదితరులు ఉన్నారు.

యువత వికసిత్ భారత్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

చార్మినార్: వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్ వేడుకలు హైదరాబాద్ నోడల్ జిల్లాలో సిటీ కాలేజీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామని వైస్ ప్రిన్సిపాల్ డా.విప్లవ దత్ శుక్లా తెలిపారు. ఈ సందర్భంగా వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్ పోస్టర్‌ను కాలేజీలో విడుదల చేశారు. దేశంలోని యువత ఆలోచనలకు, అభిప్రాయాలకు ప్రాధాన్యతను ఇచ్చి, విధాన నిర్ణయాల రూపకల్పనలో యువ దృక్పథాలకు కూడా చోటు కల్పించాలన్న భారత ప్రధాని ఆలోచనలకు రూపమే వికసిత్ భారత్ యువ పార్లమెంటని అన్నారు. యువ పార్ల మెంట్‌లో పాల్గొనదలచిన వారు గూగుల్ మై భారత్ పోర్టల్‌లో మెగా ఈవెంట్‌ను క్లిక్ చేసి నమోదు కావచ్చని అన్నారు. రిజిస్ట్రేషన్ అనంతరం వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్ గురించి ఏమనుకుంటున్నారనే అంశంపై ఒక నిమిషం వీడియో తీసి అప్లోడ్ చేయాల్సి ఉంటుందన్నారు. రిజిస్ట్రేషన్ కార్యక్రమం ఈనెల 9వ తేదీ వరకు ఉంటుందని తెలిపారు. జిల్లా స్థాయిలో ఎంపికైన వారిని రాష్ట్ర స్థాయికి, రాష్ట్ర స్థాయిలో ఎంపికైన వారిని జాతీయ స్థాయికి (పార్లమెంట్) పంపించడం జరుగుతుందన్నారు. ఇతర వివరాలకు 9494317649, 7618591249 లలో సంప్రదించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన అధికారి ఖుష్బూ గుప్తా, ఎన్ ఎస్ ఎస్ సమన్వయకర్త డా.డి.నాగరాజు, ప్రోగ్రాం ఆఫీసర్లు డా.సుదక్షిణ, డా.కృష్ణ చంద్ర, డా.కె.భాస్కర్, ఐక్యూఏసీ కన్వీనర్ డా.నీరజ పాల్గొన్నారు.

అందరూ రక్తదానం చేయాలి

మణికొండ: ఆరోగ్యంగా ఉన్న ప్రతి ఒక్కరూ ఆరు నెలలకు ఒకసారి రక్తదానం చేయాలని మహాత్మాగాంధీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ప్రిన్సిపాల్ చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. బుధవారం కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో లయన్స్‌క్లబ్ జూబ్లీహిల్స్ వారి సహకారంతో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. శిబిరాన్ని ప్రారంభించిన ప్రిన్సిపాల్ మాట్లాడుతూ..ఆరు నెలలకు ఒకసారి రక్తదానం చేయటం వల్ల రక్తం ఉత్పత్తి పెరుగుతుందన్నారు. లయన్స్ క్లబ్ సభ్యులు విజయలక్ష్మి, అరుణ పాల్గొన్నారు.

పోషకాహారంతో కేన్సర్ నియంత్రణ



మాట్లాడుతున్న పోషకాహార నిపుణురాలు అంజలీదేవి

బంజారాహిల్స్: పౌష్టికాహారం తీసుకోవడం వల్ల మహిళలు శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉంటారని పోషకాహార నిపుణురాలు డాక్టర్ సి.అంజలీదేవి అన్నారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ, యూజీసీ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న ఫిట్ ఇండియా కార్యక్రమంలో భాగంగా 'మహిళల క్రీడా వారోత్సవ' సందర్భంగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో 'పోషకాహారమే ఆరోగ్యం'పై బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పోషకాహార నిపుణురాలు డాక్టర్ సి.అంజలీదేవి పోషకాహారం వినియోగంపై ఉపన్యాసం ఇచ్చారు. ప్రోటీన్స్, విటమిన్లు, ఖనిజాలు, లవణాలు ఉన్న ఆహారాన్ని తీసుకుంటే 60 శాతం కేన్సర్ రాకుండా అడ్డుకోవచ్చన్నారు. యూజీసీ-డెబ్ డైరెక్టర్ పల్లవీ కాబ్డే మాట్లాడుతూ రాబోయే రోజుల్లో మహిళల కోసం క్రీడా వారంలో భాగంగా విశ్వవిద్యాలయ మహిళా ఉద్యోగులు, మహిళా విద్యార్థులకు స్వీయ రక్షణ, మార్షల్ ఆర్ట్స్, మానసిక ఆరోగ్యం, యోగ తదితర అంశాలపై అవగాహన కార్యక్రమాలు, చివరి రోజున పింక్ సైక్లోథాన్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో విశ్వ విద్యాలయ మహిళా విభాగం ఇన్‌చార్జి డైరెక్టర్ మేరీ సునంద, శ్రీదేవి, ప్రమీలా కేతావత్, విశ్వవిద్యాలయ మహిళా ఉద్యోగులు, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు



పరీక్షల కేంద్రం విద్యార్థులు



సంతోష్‌నగర్: ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు బుధవారం మొదటి రోజు ప్రశాంతంగా జరిగాయి. సంతోష్‌నగర్, ఐ.ఎస్.సదన్ డివిజన్లలోని పలు కళాశాలల్లో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. సాధన కళాశాల, సాన్వి కళాశాల, నారాయణ, వికాస్, హిదాయత్ కళాశాల, మేధ కళాశాలలో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. పరీక్షల సందర్భంగా అధికారులు అన్ని రకాల ఏర్పాట్లు చేశారు. మొదటి రోజు విద్యార్థులు పరీక్ష కేంద్రానికి ముందుగానే చేరుకున్నారు. పరీక్షలకు హాజరైన విద్యార్థులకు ఆయా కళాశాల వద్ద సిబ్బంది క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించి పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించారు. పరీక్షలను పురస్కరించుకొని కేంద్రాల వద్ద పోలీసులు గట్టి బందోబస్తును ఏర్పాటు చేశారు.

మహారాష్ట్రలో కొనుగోలు.. నగరంలో విక్రయం

ఐదుగురు గంజాయి విక్రేతల అరెస్టు..
రెండు కిలోల గంజాయి స్వాధీనం..

బంజారాహిల్స్: మహారాష్ట్రలో గంజాయి కొనుగోలు చేసి, నగరంలో విక్రయిస్తున్న ఐదుగురు సభ్యుల ముఠాను బుధవారం పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాల్లోకి వెళితే.. శ్రీనగర్‌కాలనీలోని నవోదయకాలనీ గణపతి కాంప్లెక్స్ వద్ద కొంతకాలంగా గుట్టుచప్పుడు కాకుండా గంజాయి విక్రయిస్తున్నట్లుగా సమాచారం అందడంతో జూబ్లీహిల్స్ పోలీసులు ఓ ప్లాట్‌పై దాడి చేసి ఐదుగురు గంజాయి విక్రేతలు, ముగ్గురు కొనుగోలుదారులను అరెస్టు చేశారు. ఈ సందర్భంగా నవోదయకాలనీ గణపతి కాంప్లెక్స్ ప్లాట్‌నెంబర్ 201లో గాదె సాయి తేజశ్వర్‌రెడ్డి అనే విద్యార్థితో పాటు జీహెచ్‌ఎంసీ అసిస్టెంట్ సూపర్‌వైజర్ మద్దునూరి శివాజీ, సాయి కృష్ణ సదన్ అపార్ట్‌మెంట్‌లో ఉంటున్న విద్యార్థి గార్లపాటి హేమవంశీ, ఇందిరానగర్ ప్రాంతానికి చెందిన పాలకుర్తి శ్రీకాంత్, ఎస్సార్‌నగర్‌లోని హాస్టల్‌లో ఉంటున్న కాగితపల్లి హేమసుందర నాగరాజులను అరెస్టు చేసి వారి నుంచి రెండు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వీరు మహారాష్ట్రలోని పర్లి రాజేంద్రనగర్ చౌక్‌లో అంజద్ అనే ప్రధాన గంజాయి విక్రేత నుంచి రెండు కిలోల గంజాయి తీసుకువచ్చి నగరంలో అవసరమైన వారికి విక్రయిస్తున్నట్లు తెలిపారు. ఫిలింనగర్‌కు చెందిన జహంగీర్, కృష్ణానగర్‌లో ఉంటున్న కుంచాల ఉదయ్ వెంకట్, యాదగిరినగర్‌కు చెందిన దోమ రాకేష్ గంజాయి సేవిస్తుండగా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వీరందరిపై ఎన్‌డీపీఎస్ యాక్ట్ కింద జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసి అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

వైభవంగా శ్రీవారి రథోత్సవం



బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ శ్రీ వేంకటేశ్వర స్వామి 5వ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా బుధవారం ఆలయంలో స్వామివారి రథోత్సవం కన్నుల పండువగా జరిగింది. బ్రహ్మోత్సవాల్లో శ్రీవారి రథోత్సవాన్ని కనులారా చూస్తే జన్మరాహిత్యం కలుగుతుందని శాస్త్రం చెబుతుందని అర్చకులు తెలిపారు. నగర నలుమూలల నుంచి వచ్చిన భక్తులు స్వామివారి రథాన్ని లాగేందుకు పోటీ పడ్డారు. సాయంత్రం స్వామివారు అశ్వ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు.



తాగునీటిలో కోతలు విధించొద్దు

- ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్



జలమండలి ఎండీ అశోక్‌రెడ్డితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కౌసర్, ముజీబ్ తదితరులు

గోల్కొండ: ఈ వేసవిలో కార్వాన్ నియోజకవర్గానికి తాగునీటిలో ఎటువంటి కోతలు విధించొద్దని ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. బుధవారం ఆయన జలమండలి మేనేజింగ్ డైరెక్టర్ అశోక్‌రెడ్డిని కలిశారు. కార్వాన్‌లోని పలు డివిజన్లలో తాగునీటి సరఫరాలో ఎన్నో అవాంతరాలు వస్తున్నాయని, ఈ కారణంగా పలు ప్రాంతాల్లో నీరందక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆయన దృష్టికి తెచ్చారు. పబ్లిక్ బోర్లు ప్రజలకు అందుబాటులో లేకుండాపోయాయని దీంతో ప్రజలు నల్లాల మీదే ఆధారపడి ఉన్నారన్నారు. జంటనగరాలకు తాగునీరు అందించే జలాశయాలలో నీరు సంవృద్ధిగా ఉన్నదని ప్రభుత్వ ప్రకటనలు వస్తున్నాయని ఇటువంటి పరిస్థితుల్లో ప్రజలకు సరిపడా తాగునీరు అందించాల్సిన అవసరం ఉందన్నారు. నియోజకవర్గానికి నీరు సరఫరా చేసే రిజర్వాయర్ల అధికారులను అడిగి కార్వాన్ నియోజకవర్గానికి ఎంత నీరు అవసరం అన్న విషయం తెలుసుకొని కోతలు లేకుండా చూస్తానని ఈ సందర్భంగా జలమండలి మేనేజర్ హామీ ఇచ్చారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ..

సంక్షేమ పథకాలను అర్హులకు మంజూరు కావడానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే కౌసర్ అన్నారు. బుధవారం ఆయన టోలిచౌకీ మెరాజ్ కాలనీలోని తన కార్యాలయంలో వైద్యం నిమిత్తం సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన చెక్కులను లబ్ధిదారులకు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..పేదల కోసం ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి విజయవంతంగా అమలు చేస్తుందని కార్వాన్ నియోజకవర్గంలో అనేక మంది లబ్ధిపొందారని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సయ్యద్ రఫత్ హుస్సేన్ తదితరులున్నారు.